ప్రజాశక్తి

బుధవారం 28 ఫిబ్రవరి 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

రద్దీ చూసి.. ధర దిగ్గోసి..

పెరగని మిర్చి ధరలు - యార్డుకు కొనసాగుతున్న తాకిడి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో 10 రోజులుగా రద్దీ కొనసాగుతోంది. ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతూనే ఉన్నాయి. మంగళవారం 1,56,917 టిక్కీలు యార్డుకు వచ్చాయి. పాత నిల్వలతో కలిపి 1,40,541 టిక్కీలు అమ్ముడుపోయాయి. ఇంకా 1,19,436 టిక్కీలు నిల్వ ఉన్నాయి. గత వారం రోజుల్లో క్వింటాళ్‌కు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ధరలు తగ్గుతున్నాయి. సరుకు భారీగా రావడం వల్ల ధరలను వ్యాపారులు తగ్గిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు పల్నాడు జిల్లాలో ఇప్పటికే రైతుల కళ్లాల్లోనే కొనుగోలు ప్రారంభించారు. యార్డులో ఎక్కువ మంది రైతుల వద్ద తేమ శాతం అధికంగా ఉందని కూడా ధర కొంత తగ్గిస్తున్నారు. గతేడాది ఇదే రోజుల్లో మిర్చి ధరలు గరిష్టంగా రూ.25 వేల నుంచి రూ.27 వేలవరకు పలికాయి.

మంగళవారం మార్కెట్‌లో ధరలు వివరాలు ఇలా ఉన్నాయి. మేలురకం తేజ, బాడిగ రకాలు కనిష్టంగా క్వింటాళ్ రూ.9 వేలు ఉండగా గరిష్టంగా రూ.21 వేలు పలికాయి. సాధారణ రకాల ధరలు కనిష్టంగా రూ.9 వేలు పలకగా గరిష్టంగా రూ.20,400 మాత్రమే పలికాయి. 334 కనిష్ట ధర రూ.10 వేలు గరిష్ట ధర క్వింటాలు రూ.20,400, నెంబరు 5 రకం 10,500, రూ.19 వేలు, 273 రూ.12,500, 19,500, 341 వెరయిటీ రూ.9 వేలు, రూ.20 వేలు, సూపర్ 10 రూ. 13వేలు, రూ.16,700 ధర వచ్చింది.

గత నెల రోజుల కాలంలో సరుకు ఎక్కువ వచ్చిన రోజున ధరలు భారీగా తగ్గిస్తున్నారు. సరుకు తక్కువగా వచ్చిన రోజు సగటు ధర స్వల్పంగా పెంచడం వ్యాపారులకు పరిపాటిగా మారింది. ఏ వెరైటీ కూడా గరిష్టంగా రూ. 21 వేలు దాటడం లేదు. సరుకు ఒకేసారి ఎక్కువగా రావడం వల్ల ధరలు తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇళ్లల్లో నిల్వ చేసుకోలేమని, కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసుకున్నా ప్రస్తుతం అప్పులు చెల్లించేందుకు నగదు అవసరమని, అందుకే అయిన కాడికి అమ్ముకుంటున్నామని చెబుతున్నారు.

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరాకు కనిష్టంగా 10 నుంచి15 క్వింటాళ్లు కూడా రాలేదు. నీటి సరఫరా బాగున్న ప్రాంతాలు, బోర్లు ద్వారా సాగుచేస్తున్న కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఎకరాకు 18 నుంచి 20 క్వింటాళ్ల వరకు వచ్చింది. కానీ కాల్వచివరి భూముల్లోని రైతులకు సకాలంలో నీరు అందక ఇబ్బంది పడ్డారు. జనవరిలో ఒక తడికి నీరు అవసరం ఉన్నా కాల్వలకు నీరు విడుదల చేయకపోవడం వల్ల నీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీంతో దిగుబడి తగ్గింది. గతంలో ధర కొంత తగ్గినా దిగుబడి బాగుంటే రైతులకు కొంత ఉపశమనం ఉండేది. ఈ ఏడాది ధరలు పూర్తిగా ఆశాజనకంగా లేకపోవడం, దిగుబడి లేక రైతులు నిరాశకు గురవుతున్నారు.

అతిథులను సత్కరిస్తున్న వీసీ పి.రాజశేఖర్ తదితరులు

పెట్టుబడిదారీ విధానాన్ని రూపుమాపితేనే అందరికీ సమాన అవకాశాలు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్జాతీయ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఆస్ట్రేలియన్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'మార్జినాలిటీ అండ్ మల్టీ కల్చరల్ లిటరరీ నేటివ్ ఆస్ట్రేలియా అండ్ ఇండియా' అంశంపై రెండ్రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో మంగళవారం ఆస్ట్రేలియా నుంచి వచ్చిన పలువురు ప్రొఫెసర్లు, ఆన్లైన్ ద్వారా మరి కొందరు ప్రసంగించారు. ముందుగా ప్రొఫెసర్ సిడియోల్ ఫ్రాంక్ హెచ్. దీన మాట్లాడుతూ సమాజంలో వివక్ష రూపుమాపడానికి ప్రేమ, విలువ, వ్యవస్థ ఎంతో ముఖ్యమన్నారు. ఈ సందర్భంలో కరీబియన్ డియా స్పోరిక్‌ను ఉద్దేశించి ఉద్వేగ భరితంగా ప్రసంగించారు. ప్రొఫెసర్ పాల్ శరద్ తాను రాసిన ఏ షార్ట్ హిస్టరీ ఆఫ్ ఆస్ట్రేలియన్ లిటరేచర్ అనే పుస్తకాన్ని విడుదల చేశారు. బ్లాక్ డయాస్పోరిక్ సంక్షోభం నేపథ్యంలో సాధ్యాయన యోగ సూత్రం యొక్క సాంస్కృతిక, సామాజిక చిక్కులను ప్రొఫెసర్ షమీం వివరించారు. డాక్టర్ క్రిస్టియన్ మాట్లాడుతూ విలియమ్స్ ఆస్ట్రేలియాలో దక్షిణాసియా డయాస్పరిక్ సాహిత్యాన్ని అన్వేషించిన ఆయన దాని ప్రాముఖ్యత వెలుగునిస్తుందని అన్నారు. న్యూయార్క్‌కు చెందిన ప్రొఫెసర్ నికోలస్ బిర్న్స్ మాట్లాడుతూ సాంస్కృతికతపై పెట్టుబడిదారీ విధానం, వలసవాద ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు. పెట్టుబడిదారీ విధానాన్ని తగ్గించినప్పుడే ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు ఉంటాయన్నారు. ప్రొఫెసర్ రాజేష్ కర్నకల్ మాట్లాడుతూ దళిత సాహిత్యాన్ని సంప్రదాయ సాహిత్య సిద్ధాంతాల ద్వారా అంచనా వేయలేమన్నారు. అయితే ఈ అవగాహనలో ఒక నమూనా మార్పును అందజేస్తుందని చెప్పారు. ఇండియాకు చెందిన ప్రొఫెసర్ సుజా కురుప్ మాట్లాడుతూ బహుళ సాంస్కృతికత ప్రపంచీకరణ యొక్క పర్యాయపదాలను వివరించారు. ప్రొఫెసర్ వైఎస్ శరత్ మాట్లాడుతూ హిజ్రా గుర్తింపు సాహిత్యంపై వెలుగునిస్తుందన్నారు. అట్టడుగు వర్గాలను బాగా అర్థం చేసుకోవడానికి ఈ సాహిత్యాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రొఫెసర్ వి.నిర్మల అనువాద రచన ఫైర్ ఫ్లైస్ పై విమర్శనాత్మక సమీక్షను వివరించారు. సదస్సు డైరెక్టర్ అయిన ప్రొఫెసర్ పి.రాజశేఖర్ సదస్సులో పాల్గొన్న కీనోట్ స్పీకర్లను సత్కరించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ, అగ్రవర్ణాల ప్రభావం తగ్గినప్పుడే సామాన్యులు కూడా సమానత్వంలోకి వస్తారని అభిప్రాయం వ్యక్తం చేశారు. సదస్సులో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఇంగ్లీష్ విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ జి.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

1వ తేదీ నుండి అగ్ని ప్రమాద బాధిత పసుపు రైతుల రిలేదీక్షలు

పే 5

ఇసుక తవ్వితే కఠిన చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జిల్లాలోని అన్ని ఇసుక రీచ్‌లలో తవ్వకాలను నిలిపేస్తున్నట్లు పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఇసుక క్వారీలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక తవ్వకాలపై గడిపర్తి వెంకట శివశంకర వరప్రసాద్ మరో ఐదుగురు హైకోర్టులో పిల్ వేసిన నేపథ్యంలో హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ముత్తాయపాలెంలో గల ఇసుక రీచ్ తోపాటు జిల్లాలోని మిగతా ఇసుక క్వారీల్లోనూ ఇసుక తవ్వకాలు నిలిపేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి అన్ని అనుమతులు వచ్చేవరకూ ఇది అమలులో ఉంటుందన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక క్వారీలపై రెవెన్యూ అధికారులు నిఘా ఉంచాలన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోతో పాటు పెదకూరపాడు, క్రోసూరు, అమరావతి, అచ్చంపేట తహాశీల్దార్‌లకు దీనికి సంబంధించి పలు సూచనలు చేశారు. అనుమతులు త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పొల్యూషన్ అధికారులను ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో చీఫ్ సెక్రెటరీ తనిఖీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మాతా శిశు మరణాల నివారణకు అంగన్వాడీ వ్యవస్థను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి సూచించారు. నరసరావుపేట మండలంలోని లింగంగుంట పరిధిలో గల అంగన్వాడీ సెంటర్లను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్‌తో కలిసి ఆమె మంగళవారం తనిఖీ చేశారు. పల్నాడు జిల్లాలోని పలు అంగన్వాడి కేంద్రాలకు పూర్వ ప్రాథమిక విద్యలో భాగంగా పిల్లల శారీరక, మానసిక అభివృద్ధిని పెంపొందించడం కోసం రూ.80 లక్షలతో అంగన్వాడీ కేంద్రాలకు 10 రకాల క్రీడా సామాగ్రిని సమకూర్చినట్లు చెప్పారు. క్రీడలు చిన్నారుల్లో మానసిక పునరుత్తేజానికి దోహదం చేస్తాయని, తద్వారా ఆరోగ్యం మెరుగు పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ ఉమారాణి, సిడిపిఒ ఉమామహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి కెవి శివప్రసాద్, సూపర్‌వైజర్‌లు మేరీ జ్యోస్న, అంగన్వాడీ టీచర్ పద్మ పాల్గొన్నారు.

టెట్‌కు తొలిరోజు 86.75 శాతం హాజరు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్-2024 పరీక్ష మంగళవారం ప్రారంభమైంది. గుంటూరు జిల్లాలో నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా పరీక్ష జరిగింది. మొదటిరోజు 1797 మందిని కేటాయించగా, 1559 మంది హాజరయ్యారు. 238 మంది గైర్హాజరయ్యారు. యూనివర్సల్ కాలేజి, చల్లావారిపాలెంలోని బాలాజీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ప్రియదర్శినీ ఇంజినీరింగ్ కాలేజి, ఏఎన్‌యు ఇంజినీరింగ్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఆయా కేంద్రాలను పరీక్ష స్టేట్ అబ్జర్వర్ పి.పార్వతి, జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ సందర్శించి, ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట 3 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. కోటప్పకొండరోడ్డులోని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, నరసరావుపేట మండలంలోని పెట్లూరువారిపాలెం గ్రామ పరిధిలోగల ఎఎం రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహించారు. మొదటిరోజు 655 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 600 మంది హాజరుకాగా 55 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎన్నికల్లో ఎన్ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల పాత్ర కీలకం

పే 8

ఉపాధ్యాయుల చేతుల్లోనే సమాజ భవిష్యత్తు

ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు - అచ్చంపేట, క్రోసూరు మండలాల్లోని ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి - క్రోసూరు

యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని కెవిఆర్ అండ్ జయలక్ష్మీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, యుటిఎఫ్ ఆధ్వర్యంలో క్రోసూరు, అచ్చంపేట మండలాల పరిధిలోని ఉత్తమ ఉపాధ్యాయులకు స్థానిక జై భారత్ పబ్లిక్ స్కూల్లో మంగళవారం ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజం బాగుపడాలన్న, రేపటి తరాలు బాగుండాలన్న ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. అంత కీలకమైన ఉపాధ్యాయులను ప్రోత్సహించేందుకు తన తల్లిదండ్రుల పేరు మీదుగా అవార్డులను ప్రదానం చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే నంబూరి శంకరరావు మాట్లాడుతూ అవార్డు పొందిన ఉపాధ్యాయులకు మరింత బాధ్యత పెరిగిందని, వారు ఉత్సాహంతో పని చేయాలని చెప్పారు. అనంతరం ఎంఇఒ వై.ప్రసాదరావు మాట్లాడారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి, నాయకులు బి.నరసింహారెడ్డి, కె.ప్రకాశరావు, జి.లూకా, షేక్ ఖాజావలి, కె.శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వరరావు, షేక్ మహబూబ్ బాషా, టి.శౌరెడ్డి పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను సందర్శించారు. పాఠశాల నిర్వహణ తీరును గమనించి హెచ్‌ఎం సిస్టర్ మేరీ రజితను అభినందించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. కాళ్లు, చేతులు లేకున్నా పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత స్థాయికి ఎదగొచ్చని, అందుకు సమకాలీన ఉదాహరణ నిక్ వుజిక్ అని అన్నారు. ఆయన్ను ప్రేరణగా తీసుకుని లక్ష్యాలను చేరుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో శౌరెడ్డి, బాలశౌరెడ్డి, గోవింద్‌రెడ్డి, లక్ష్మణ్, ప్రకాష్ విజయ్, బురాన్ పాల్గొన్నారు.

ప్రతి అంగన్వాడీ కేంద్రాన్నీ అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో 'లిటిల్ ఫీట్స్' నిర్వహణలో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సహకారం బాగుందని మహిళా అభివద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జి.జయలక్ష్మి అన్నారు. పల్నాడు జిల్లాలో 'మిషన్ లిటిల్ ఫీట్స్' ఆట వస్తువులను 120 అంగన్‌వాడి కేంద్రాలకు ఐఓసీఎల్ సహకారంతో విరాళంగా అందించారు. కనెక్ట్ ఆంధ్రా ప్రసాద్ సహకారంతో ఐఓసీఎల్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీరాములు జిల్లా కలెక్టర్‌కు అనుసంధానమై అంగన్‌వాడి కేంద్రాలకు తగిన ఆట వస్తువులను అందజేశారన్నారు. ఈ సందర్భంగా స్థానిక భువనచంద్ర టౌన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన 'మిషన్ లిటిల్ ఫీట్స్' కార్యక్రమంలో జి.జయలక్ష్మి ద్వారా అంగన్వాడిలకు అందజేశారు. విద్యార్థినిలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలుచ యోగాసనాలు, అంగన్‌వాడి పిల్లలు ఆట పాటలు ఎంతగానో అలరించాయి. జయలక్ష్మి మాట్లాడుతూ వెనుక బడిన పల్నాడు జిల్లాలో ఐఓసీఎల్ అంగన్వాడి అభివృద్ధికి పని చేసే విధంగా సంస్థగా పేరు తీసుకురావాలని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 11 రకాల వస్తువులను ఎస్ఆర్ ఫౌండేషన్ కింద అంగన్వాడీ కేంద్రాలకు ఆందించామన్నారు. 1200 కేంద్రాలకు ఐఓసీ ఎల్ సాయం చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, కనెక్టింగ్ ఆంధ్రా ప్రసాద్, ఐఓసీఎల్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీరాములు, ఐసిడిఎస్ పీడీ ఉమారాణి, అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి

ప్రజాశక్తి - వినుకొండ

బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ ఆఫీస్ జాషువా కళా ప్రాంగంణములో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సిడిపిఒ బి.అరుణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. బాలలకు సంబంధించిన చట్టాలు, హక్కులు, బాల్య వివాహాల నిషేధం చట్టం 2006, జీవో ఎంఎస్ 31, 39 పై అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ బాల్యవాహాలు జరగకుండా ప్రతి గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిగితే అందుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారికి రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తారని అన్నారు. పోక్సో చట్టం ప్రకారం 14 ఏళ్లలో బాలికను పెళ్లి చేసుకున్న మేజర్ వరుడికి 20 ఏళ్ల జైలు, 16-18 ఏళ్లలోపు మైనర్ బాలికలను పెండ్లి చేసుకున్న వరుడుకి పదేళ్ల వరకూ కఠిన కారగార శిక్ష పడుతుందన్నారు. బాల్య వివాహాల నిరోధక కమిటీలకు చైర్మన్‌గా సర్పంచ్, కన్వీనర్లుగా మహిళా సంరక్షణ కార్యదర్శులు, పంచాయతీ సెక్రటరీలు రెవెన్యూ అధికారులు ఉంటారని చెప్పారు. బాలల హక్కులకు భంగం వాటిల్లకుండా నిరంతరం పర్యవేక్షణ, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలోకి తిరిగి చేర్పించడం వంటివి చేపట్టామన్నారు. చదువు ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉందని, సమానత్వం, సామాజిక న్యాయం సాధ్యమని వివరించారు. కార్యక్రమంలో ఈపూరు ఎంపీడీవో రంగనాయకులు, ఈపూరు జెడ్‌పిటిసి చౌడయ్య, బొల్లాపల్లి ఎంఈఓ జప్రుల్ల ఖాన్, బొల్లాపల్లి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వై.పద్మావతి, ఈపూరు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీల్ చౌదరి, ఈపూరు ఏపీఎం రంగారెడ్డి, బొల్లాపల్లి జెడ్పిటిసి బీబీ నాయక్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలలో పేద విద్యార్థులు ఉచిత విద్యకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - చేబ్రోలు

ఆరేళ్లు నిండిన పేద పిల్లలకు విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలలలో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు ఎవిహెచ్ ప్రసాద్, ఆర్.సుబ్బారావు తెలిపారు. 25 శాత ఎస్సీ, 10 శాతం ఎస్టీ, 4 శాతం బిసిలకు, 6 శాతం మైనార్టీలకు, 5 శాతం విభిన్న ప్రతిభావంతులకు, హెచ్ఐవి బాధితులకు, అడ్మిషన్లు కేటాయించబడినట్లు తెలిపారు. స్టేట్ సిలబస్, సీబీఎస్ఈ, ఐబిఎస్ సిలబస్ బోధించే తమ సమీప ప్రైవేటు పాఠశాలలలో వచ్చే విద్యా సంవత్సరం విద్యనుభ్యసించడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 14వ తేదీ వరకు లోపు విద్యార్థులు తమ దరఖాస్తుతో పాటు ఆధార్ కులం ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలతో గ్రామ సచివాలయంలో కాని, నెట్ సెంటర్ లేదా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రైవేటు పాఠశాలలో ప్రవేశం కోరే విద్యార్థులు 2017 ఏప్రిల్ నుండి 2018 మార్చి 31 వరకు వ తేదీ మధ్య జన్మించి ఉండాలని తెలియజేశారు.

చంద్రబాబును కలిసిన శ్రీకృష్ణదేవరాయులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉండవల్లిలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడ్ని నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు మంగళవారం సాయంత్రం కలిశారు. త్వరలో ఆయన టిడిపిలో చేరేందుకు చంద్రబాబును తేదీ కోసం కలిసినట్టు తెలిసింది. త్వరలో చిలకలూరిపేటలో నిర్వహించే రా కదలిరా సభలో చంద్రబాబు సమక్షంలో శ్రీకృష్ణదేవరాయులు కలవాలని తొలుత నిర్ణయించినా ఈ సభకు చాలా సమయం ఉన్నందున వచ్చేనెల మొదటి వారంలోనే పార్టీలో చేరేందుకు ఆయన సన్నద్ధమవుతున్నట్టు తెలిసింది. ఈ అంశంపై చంద్రబాబుతో చర్చించినట్టు సమాచారం. అంతేగాక ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి గురజాల అసెంబ్లీ స్థానం కేటాయించే అంశంపై కూడా చర్చించినట్టు సమాచారం. అయితే జంగాకు ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్సీ పదవిని కొనసాగించేందుకు పార్టీ అధిష్టానం మొగ్గుచూపిందని పార్టీవర్గాలు తెలిపాయి. గురజాలలో మాజీ ఎమ్మెల్యే యరపతినేనికి అవకాశం ఇవ్వాలని చంద్రబాబు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్టుపార్టీ వర్గాలు తెలిపాయి.


ప్రశంశా పత్రం అందుకుంటున్న సర్పంచ్ పోనుగోటి నాసరయ్య

స్వచ్ఛ పంచాయతీగా కొనకంచివారిపాలెం

ప్రజాశక్తి- రొంపిచర్ల

ఉత్తమ గ్రామ పంచాయతీగా స్వచ్ఛ పంచాయతీగా మండలంలోని కొనకంచివారిపాలెం అవార్డు పొందినట్లు సర్పంచ్ పోనుగోటి నాసరయ్య మంగళవారం తెలిపారు. జగనన్న స్వచ్ఛ సంకల్ప కార్యక్రమంలో భాగంగా గుంటూరులో అవార్డును అందుకున్నట్లు చెప్పారు. ఇది తమపై బాధ్యతను మరింత పెంచిందన్నారు.

వడ్డిముక్కలలో నిజనిర్ధారణ కమిటీ పరిశీలన

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : మండలంలోని వడ్డిముక్కలలో ముస్లిమ్ మైనార్టీలపై జరిగిన దౌర్జన్యాలపై వాస్తవ పరిస్థితులు తెలుసుకొనేందుకు మంగళవారం గ్రామాన్ని నిజ నిర్ధారణ కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా పలు విషయాలను స్థానికులు వారికి వివరించారు. ముస్లిములు నివసించే ప్రాంతంలో గ్రామ నడిబొడ్డున ఉన్న పంచాయతీ మురుగు కాల్వలో రాళ్లు, మట్టితో కాల్వను వైసిపికి చెందిన నాగభూషణం, అతని కుమారుడు పూర్తిగా పూడ్చి వేయడం జరిగిందని, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత సదరు వైసిపి నాయకులు ముస్లిములకు చెందిన ఎన్నో ఏళ్లుగా జండా చెట్టుకు వెళ్లే ఆరు అడుగుల రహదారిని కంచి వేసి దడికట్టి అడ్డుగా రాకపోకలు జరపుకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. తరచూ కారణం లేకుండానే దుర్భాషలాడుతున్నారని వాపోయారు. గ్రామపంచాయతీ సెక్రటరీకి సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా అతనిపై చర్యలు తీసుకోలేదని, ఇదే విషయమై పొన్నూరు రూరల్ స్టేషన్ ఎస్పైకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకుచర్యలు తీసుకోలేదని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు అబ్దుల్ గని, స్టేట్ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మోసిన్, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ అహ్మద్ ఖాన్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ ఫైరోజ్ ఖాన్, పట్టణ జనసేన అధ్యక్షులు షేక్ కరిముల్లా, జనసేన మండల పార్టీ అధ్యక్షులు సుబ్బారావు, బాజీ సాహెబ్, మండలం మైనార్టీ అధ్యక్షులు భాష, జానీ బేగ్, సిలార్ భాష, ఇస్మాయిల్, హజరత్ అలీ, కరీముల్లా బాజీ, పఠాన్ ఫేజుల్లాఖాన్ (పండు) పాల్గొన్నారు.

ఘనంగా వైద్య విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు వైద్య కళాశాల లో 2018 బ్యాచ్ ఎం బి బి ఎస్ వైద్య విద్యార్థుల 73 వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. వైద్య కోర్స్‌ను ముగించుకుని యువ వైద్యులుగా అడుగుతుపెడుతున్న వారికి మెడికల్ ఎడ్యుకేషన్ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ రఘునందన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టిటికే రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అభినందనలు తెలిపారు. ముందుగా జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కల్సి ప్రాంగణంలో సెల్ఫీ లు దిగుతూ సందడి చేసారు. ఈ సందర్భంగా జరిగిన వేడుకలను ఉద్దేశించి డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ ఎంతో ఉన్నతమైన వృత్తి లోకి వెళుతున్న వైద్యులు బాధ్యత గా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలన్నారు. జీవితాన్ని అందంగా తయారు చేసుకోవాలని ఎక్కువ విజ్ఞానాన్ని సంపాదించి రోగులకు ఉన్నతమైన వైద్య సేవలు అందించాలని అయన కోరారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ తల్లితండ్రుల కలలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఒకరి కోసం ఎదురు చూడకుండా తమ సొంత ఆలోచనలతో ఎదగాలని ఆయన సూచించారు. ధైర్యంతో ముందుకు వెళ్లాలని కష్టపడి పని చేసి ప్రతి ఒక్కరికి ఆదర్శం గా నిలవాలని ఆయన అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టిటికె రెడ్డి మాట్లాడుతూ ఉన్నతమైన ఆశయాలతో వైద్య వత్తిలో కొనసాగాలని ఆకాక్షించారు. వైద్య విలువలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అయన చెప్పారు. డాక్టర్ పొదిల ప్రసాద్ మాట్లాడుతూ వైద్య వత్తి అనేది ఎంతో కష్టమైనది అన్నారు. ఈ కళాశాల నుంచి విదేశాల్లో దాదాపు రెండు వేల మందికి పైగా పూర్వ విద్యార్థులు ఉన్నారని ఆయన గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు వైద్య వత్తిని ఇష్టంగా తీసుకుని మంచి నడవడి క తో వైద్యులుగా ఎదగాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ , జింకాన కో ఆర్డినేటర్ డాక్టర్ హనుమంత రావు, డాక్టర్ భాస్కర రావు, పాల్గొన్నారు. 1981 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు కానూరి ఏం సి హె చ్ బ్లాక్ కు 6.33 లక్షలు డాక్టర్ హనుమంత రావు కు అందచేశారు.

భారత్ పే యాప్ పేరుతో మోసం

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరి పట్టణంలోని ఓ చికెన్ దుకాణం వద్ద పర్సనల్ లోన్ ఇప్పిస్తానంటూ మోసం చేసి పరారైన యువకుడు సంఘటన మంగళవారం మంగళగిరి పట్టణంలో జరిగింది. మంగళగిరి పట్టణంలో బి శ్రీనివాస్ అనే వ్యక్తి చికెన్ దుకాణం నడుపుతున్నాడు. భారత్ పే యాప్ పేరుతో పర్సనల్ లోన్ ఇప్పిస్తానని చెప్పి రూ.పదిహేను వేలు నగదును తన ఖాతా నుండి సెండ్ చేసుకున్నట్లుగా మంగళగిరి పట్టణ పోలీసులకు శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. భారత్ పే యాప్ లో అప్లోడ్ చేయాలంటూ వివరాలు తీసుకొని చేసిన కాసేపటికి తన ఖాతా నుండి రూ.15 వేలు నగదు సెండ్ అయినట్లు నోటిఫికేషన్ వచ్చింది. ఇది చూసి అప్పటికే ఆ యువకుడు పరాలైనట్లుగా ఫిర్యాదుల పేర్కొన్నాడు.

రెండు బైక్‌లు, కారు దగ్ధం

ప్రజాశక్తి-తాడేపల్లి :పట్టణంలోని సీతానగరంలో సోమవారం తెల్లవారుజామున రెండు బైక్‌లు, కారు దగ్ధమయ్యాయి. ఈ దుశ్చర్యకు పాల్పడిన ఎం.ఫణిదుర్గాప్రసాద్‌ను తాడేపల్లి సిఐ మధుసూదనరావు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నవీన్‌కుమార్, వెంకటేశ్వరావుకు చెందిన రెండు బైక్‌లు, కుంభా రమేష్‌కు చెందిన కారు పూర్తిగా కాలిపోయాయి. రమేష్ మీద దుర్గాప్రసాద్‌కు తన ఇంట్లోని మహిళలకు సంబంధించి అనుమానం ఉండటంతో ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తెలుస్తుంది. తాడేపల్లి పోలీసులు కేసు విచారిస్తున్నారు.

CHANGE OF NAME

I, SHAIK KAREEMUNNISA (Old Name), W/o. Purushothapatnam Shaik Abdul Vahab, Resident of D.No.1-41, Near KL University, Mallempudi, Gundimeda, Tadepalli Mandal, Guntur District, AP-522303. My Name has been changed to **PURUSOTHAPATNAM SHAIK KARIMUNNISA (New Name),** Here after my name is known as **PURUSOTHAPATNAM SHAIK KARIMUNNISA.**

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - తెనాలి

సివిల్ ప్రొసీజర్ కోడ్‌తో సంబంధం లేని ట్రిబ్యునల్ ద్వారా భూ సంబంధిత సమస్యలు పరిష్కారం అవుతాయని తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రమాదకరమైనదని ప్రముఖ న్యాయవాది వేములపల్లి శ్రీనివాస్ తో పాటు పలువురు న్యాయ వాదులు అన్నారు. స్థానిక కోర్టు భవనాల వద్ద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు కోరుతూ న్యాయవాదులు చేపట్టిన నిరసన దీక్షలు మంగళవారం 61వ రోజుకు చేరాయి. భూ హక్కుల చట్టం లోప బోయిష్టంగా ఉందని, సామాన్యులకు ఈ చట్టంతో పెను సమస్యలు ఎదురవుతాయన్నారు. ఈ చట్టం ద్వారా భూహక్కుదారులు ట్రిబ్యునల్ తీర్పును సవాలు చేసేందుకు హైకోర్టులో మినహా అవకాశం లేదన్నారు. అది పేద వర్గాలకు సాధ్యపడే పని కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మందలపు వేణుగోపాలరావు, సీనియర్ న్యాయవాదులు ఇందుపల్లి రాజారాం, జి శ్రీనివాసరావు గౌడ్, రెడ్డి వెంకటేశ్వరరావు, సిహెచ్ వెంకటేశ్వరరావు, విజయ్ కుమార్, ఎస్ రామ్మోహనరావు, రఘు, పలువురు మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

SUIT SUMMONS

IN THE COURT OF THE HON'BLE IV ADDL.SENIOR CIVIL JUDGE::GUNTUR

O.S.No: 173 / 2022

Between:
M/s. Sri Vasavi Chillies Company,Rep.by its Partner Kunala Sekhar. ….. Plaintiff
AND
Chirala Ramana Prop.of M/s.Vyjayanthi Chillies …Defendant
To,
Chirala Ramana,S/o.Bhujanga Narasimha Rao, Prop.of M/s.Vyjayanthi Chillies, R/o. D. No.62, 1st lane, Kamakshi Nagar, Near Mirchi Yard, Guntur

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:14-03-2024న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచు కొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

వాయిదా తేది:14-03-2024

ఆత్మకూరి ప్రదీప్ కుమార్,
వాది తరపు అడ్వకేట్,
సంపత్ నగర్, గుంటూరు.
సెల్: 98854 63463

మహారాజశ్రీ అవనిగడ్డ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

ఓ.యస్. నెం. 2/2019

బిట్వీన్ :
బాదర్ల సాయిప్రసాద్ ....వాది
మరియు
బాదర్ల సాంబశివరావు, మరియు మరికొందరు ...ప్రతివాదులు

3వ ప్రతివాది : మత్తి రాము, భర్త : నాగేశ్వరరావు, వినుకొండ గ్రామం, మండలం, గుంటూరుజిల్లా (పల్నాడు)

పై నెంబరుగా గల దావాను 3వ ప్రతివాది అయిన మీపై శ్రీ కోర్టువారి ఎదుట దాఖలు చేయబడినది. సదరు దావా నందు మీ యొక్క హాజరు నిమిత్తంగా ది. 29-2-2024వ తేదీ వాయిదాగా శ్రీ కోర్టువారిచే జారీ చేయబడియున్నది.

కావున పైన పేర్కొన్న 3వ ప్రతివాది ది. 29-2-2024వ తేదీ ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట పై నెంబరుగా గల దావాలో ప్రత్యక్షంగా గానీ, వారిచే ఆర్డరు పొందిన వారి ద్వారా గానీ హాజరు కావలసినదిగా శ్రీ కోర్టువారి ఆర్డరుతో తెలియజేయటమైనది. ది.29-2-2024వ తేదీ ఉదయం 10-30 గం.లకు హాజరు కాని యెడల మీపై పై నెంబరు దావాలో పరోక్షపు ఉత్తర్వులు జారీ కాగలవని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

బాసులాపరమ్
Rep by బాసు నాంచారయ్య నాయుడు,
న్యాయవాది,
అవనిగడ్డ, కృష్ణాజిల్లా.
సెల్ : 99084 09302.

క్రికెటర్ విహారికి మంత్రి రోజా క్షమాపణ చెప్పాలి

కోవెలమూడి రవీంద్ర

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

హనుమ విహారికి మంత్రి రోజా క్షమాపణలు చెప్పి అతనికి తిరిగి కెప్టెన్సీ ఇచ్చి రాష్ట్ర క్రీడాభివద్ధికి తోడ్పడాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కోవెల మూడి రవీంద్ర డిమాండ్ చేసారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ టీంలో 17 వ స్థానంలో ఉన్న వైసిపి నాయకుడి కుమారుడిని తెలుగు తేజం, టీం ఇండియా టెస్ట్ స్పెషలిష్ట్ హనుమ విహారి మందలించాడనే కారణంతో అతన్ని ఆంధ్రా రంజీ కెప్టెన్సీ బాధ్యతల నుంచి వైదొలగేలా ఒత్తిడి చేశారన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోషియోషన్ వల్ల తనకు జరిగిన అన్యాయానికి మనస్తాపం చెందిన హనుమ విహారీ ఇకపై తాను ఆంధ్ర టీంకు ఆడనని సోషల్ మీడియా ఫ్లాట్ ఫాం ఎక్స్‌లో పోస్ట్ చేశారన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోషియోషన్ రాజకీయ ఒత్తిడికి గురై రాష్ట్రానికి ప్రతిష్ఠ తెచ్చే విహారి పట్ల అనుసరించిన విధానం సరైనది కాదన్నారు. జగన్ ప్రభుత్వం క్రీడాకారుల భవిష్యత్తుతో ఆడుకుంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠను దిగజార్చుతున్నది. మేటి క్రీడాకారులను పొరుగు రాష్ట్రాలకు తరిమేస్తుంది. పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరిమేసి నిరుద్యోగం పెంచారు. అలాగే మేటి క్రీడాకారుడు అయిన విహారినీ పొరుగు రాష్ట్రానికి వెళ్లే విధంగా వ్యవహరించడం తగదన్నారు.

విష్ణుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ఫిర్యాదు చేసిన ముస్లిం, క్రైస్తవ పెద్దలు

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరికి చెందిన విష్ణు అనే వ్యక్తి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ దిగువ భాగంలో ఉంటున్న ముస్లిం దర్గా వద్ద ఫేస్బుక్ వేదికగా ముస్లిం, క్రైస్తవులను కించపరుస్తూ మంగళవారం మాట్లాడటం జరిగింది. దీంతో మంగళగిరిలో ఉన్న ముస్లిం, క్రైస్తవ సంఘాల పెద్దలు మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ముస్లిం, క్రైస్తవ ప్రజల మనోభావాలు దెబ్బ తినే విధంగా మాట్లాడిన విష్ణు పై కఠిన చర్యలు తీసుకోవాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని ఫిర్యాదులో కోరారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-ఈపూరు :వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండలంలోని అంగలూరు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాసిన శ్రీనివాస రావు(33) గత మూడు రోజులుగా కనిపించకుండా పోయాడు. వెతికిన ఆచూకీ లభించలేదు. ఈక్రమంలో అంగలూరు నుండి గుండేపల్లి వెళ్లే రోడ్డులో అటువైపుగా వెళ్తున్న వారికి దుర్వాసన వస్తుండటంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా రోడ్డు పక్కనే పంట కాలువలో శ్రీనివాస రావు మృతదేహం కనిపించింది. వారి బంధువులకు సమాచారం అందించడంతో అక్కడకు చేరుకొని కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని అక్కడే ఖననం చేసినట్లు తెలిపారు. మృతుడు మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నట్లు, మూర్ఛ వచ్చి కాలువలో పడి ఉంటాడని ఎవరు చూసి ఉండరని అందువలనే చనిపోయి ఉంటాడని గ్రామస్తులు, బంధువులు తెలిపారు.

పురపాలక సంఘ కార్యాలయము, పొన్నూరు

ఆర్.ఓ.సి. నెం. 1755/2015/జి1 **తేది : 26-02-2024**

ప్రకటన

ప్రభుత్వ ఉత్తర్వుల నెం. 650 యం.ఎ. & యు.డి. తేది : 27-10-1993 మాస్టర్ ప్లాను ప్రకారం పొన్నూరు పురపాలక సంఘ పరిధిలో జి.బి.సి. రోడ్డును అభివృద్ధి చేయుటలో భాగంగా రూరల్ పోలీస్‌స్టేషన్ నుండి కొప్పాక వెంకయ్య కూరగాయల మార్కెట్ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ జరిగినది. సదరు రోడ్డు విస్తరణలో స్థలం కోల్పోయిన యజమానుదారులకు TDR (Transferable Development Rights) బాండ్లు జారీ చేయు విషయముపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంటు వారు మెమో నెం. 2250050/యం.2/2023, తేది : 30-10-2023 నందు స్క్రూటినీ కమిటీని ఏర్పాటు చేసియున్నారు. సదరు స్క్రూటినీ కమిటీ వారు స్క్రూటినీ చేసిన స్థల యజమానుదారుల వివరములు ఈ క్రింది విధముగా ఉన్నవి.

Sl. No.	Structure Number	Name of the Building (Or) Site Owner	Registered Deed Number	Extent of Land effected Sq.Mts.	Door Number	Survey Number
1.	6	Bhavanam Durga Venkata Priyanka	3012/2021	22.3	24-1-59	380/5
2.	19	Kommuri Nageswara Rao	815/1981	64.38	24-1-46	380/5
3.	40A	Kollipara Srinivasa Rao	2098/2007	10.92	24-1-17	380/5
4.	40	Kollipara Srinivasa Rao	2118/2007	9.15	24-1-17	380/5
5.	43	Avvaru Anjaneyulu	5090/2023	3.17	24-1-10	380/5
6.	68	Alapati Arunakumari	3083/2012	7.47	23-1-1	380/5

పై తెలిపిన వారి యొక్క డాక్యుమెంట్స్‌ను స్క్రూటినీ కమిటీ వారు తేది : 26-2-2024 స్క్రూటినీ చేసి టిడిఆర్ బ్రాండ్లు మంజూరు చేయుటకు గాను ఆమోదము తెలిపియున్నారు. కావున పై తెలిపిన వారికి టి.డి.ఆర్ బాండ్లు మంజూరు చేయు విషయములో ఏమైనా అభ్యంతరములు వున్న యెడల 15 రోజుల లోపు పొన్నూరు పురపాలక సంఘ కార్యాలయమునకు దాఖలు చేయవలెనని తెలియజేయడమైనది.

సం/- కమీషనరు,
పొన్నూరు పురపాలక సంఘం.

కులమతాలకు అతీతంగా రోటరీ సేవలు

ప్రజాశక్తి తెనాలి

కులమతాలకు అతీతంగా సమాజంలో పేదల అవసరాలను గుర్తించి రోటరీ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని టిడిపి నాయకులు, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ చేయాలంటే రాజకీయాలే వేదిక కాదని, దానికి రోటరీ క్లబ్ సేవలే ఉదాహరణగా చెప్పొచ్చన్నారు. మహిళలకు కుట్టు మిషన్లు, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, వికలాంగులకు వీల్ చైర్స్, ఉచిత వైద్య శిబిరాలు వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను ఒక రోటరీ క్లబ్ లోనే చూస్తుంటామని తెలిపారు. ప్రభుత్వం విషయానికొస్తే ఎక్కడికి వెళ్లినా ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్ సమస్యలే ఉంటున్నాయన్నారు. కేవలం ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి ఓటర్లకు చుక్కలు చూపిస్తున్నారన్నారు. ఈసారి ప్రజలు ఇచ్చే తీర్పు ఈ ప్రభుత్వానికి చెంపపెట్టులా ఉండాలని కోరారు. ఓటర్లలో చైతన్యం రావాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆలోచించి ఓటు హక్కును ఉపయోగించుకుంటేనే వైసీపీకి చరమగీతం పాడగలమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షులు పావులూరు రాంబాబు, కార్యదర్శి నెల్లూరు వెంకటేశ్వరరావు, ట్రెజరర్ కేఎల్ జగదీశ్వరరావుతో పాటు రైస్ మిల్లర్స్, మోటార్స్, రైతు సంఘం, గోల్డ్ మర్చంట్స్, బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న రోటరీ బృందం

అండర్-19 క్రికెట్ జట్టుకు ఈశ్వర్ విద్యార్థులు

ప్రజాశక్తి - నరసరావుపేట

ఒంగోలు సిఎస్ఆర్ శర్మ కళాశాలలో 50 బాల్స్ క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన క్రికెట్ ఛాంపియన్‌షిప్-2024లో తమ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు స్థానిక కేసనపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ జి.నాగమల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. తమ కాలేజీ విద్యార్థులు ఎం.వేణుబాబు, టి.ప్రసన్నకుమార్ అండర్19 జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. మే నెలలో ఉత్తరప్రదేశ్లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఎంపికైన వారిని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ షేక్.కరీం మొహిద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ షేక్. మస్తాన్ షరీఫ్, చైర్మన్ షేక్. మీరావలి అభినందించారు. తమ కళాశాలలో విద్యతోపాటు క్రీడలకూ అధిక ప్రాధాన్యతనిచ్చి విద్యార్థులు ప్రోత్సహిస్తామని చెప్పారు.

చెరుకుపాలెంలో ఆరోగ్య సురక్ష శిబిరం

ప్రజాశక్తి - అచ్చంపేట

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యనిపుణుల ద్వారా వైద్య సేవలు అందించడం అభినందయమని జెడ్‌పిటిసి తుమ్మ విజయప్రతాపరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చెరుకుంపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం మంగళవారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు మొత్తంగా 375 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వేసవి నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులు వివరించారు. 109 వృద్ధులకు డాక్టర్ సుమిత్ర, డాక్టర్ ఇన్నారావు కంటి పరీక్ష చేశారు. 100 మందికి కంటి అద్దాలు అందించనున్నారు. పలువురికి ఆరోగ్య సురక్ష కిట్లు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతగుంట్ల అనురాధ హనుమంతరెడ్డి, ఎంపీటీసీ ఎస్.సీతమ్మ, చింతపల్లి ఎంపీటీసీ జి.కొండలు, వైసిపి నాయకులు భూక్యా రజనిబాయి, కృష్ణా నాయక్, ఆరోగ్య విస్తరణ అధికారి పి.వెంకటరావు, హెచ్ఎస్ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి బి.శివయ్య, ఎంఎల్‌హెచ్‌పి మహేష్, లలిత, రోజారాణి పాల్గొన్నారు

నిబంధనల ప్రకారం నడుచుకోవాలి

ప్రజాశక్తి - పెదకూరపాడు : ఎన్నికల నిబంధనల ప్రకారమే బిఎల్వోలు ఇతర అధికారులు నడుచుకోవాలని పెదకూరపాడు నియోజకవర్గ ఓట్ల నమోదు అధికారి అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం పెదకూరపాడు తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకుల సమావేశం జరిగింది. అజయ్‌కుమార్ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. రాజకీయ పార్టీ నాయకులు తమకు ఏమైనా సమస్యలుంటే రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు. సమావేశంలో పెదకూరపాడు, క్రోసూరు తహశీల్దార్లు ప్రభాకర్‌రావు, సువర్ణ పాల్గొన్నారు.

అప్పులు చేసి పనులు.. అయినా దక్కని బిల్లులు

మూడేళ్లుగా రూ.కోట్లలో పెండింగ్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చేసిన పనులకు బిల్లులు రాక.. కొత్త పనులు చేయలేక మున్సిపల్ కాంట్రాక్టర్లు ఆర్థికంగా సతమతం అవుతున్నారు. ఇకమీదట ఏ పనులు చేయాలన్నా పాత బిల్లులు ఇస్తేగాని చేయలేమని చెబుతున్నారు. ఇటీవల సచివాలయాల వారీగా చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు రూ.రెండు కోట్లతో కలిపితే గత మూడున్నరేళ్లలో మొత్తం రూ.9.5 కోట్ల పనులకు సంబంధించి బిల్లులు కాంట్రాక్టర్లకు రావాల్సి ఉంది. మున్సిపల్ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనుల బిల్లులూ ఇందులోనే ఉన్నాయి. పనుల సందర్భంలోనే బిల్లులు సరిగా మంజూరవక కొంతమంది మధ్యలోనే పనులను ఆపేసిన రాజకీయ ఒత్తిళ్లతో చేయాల్సి వచ్చిందని, దీంతో ఫైనాన్స్‌లో అప్పులు తెచ్చి మరీ ఆ పనులు పూర్తి చేశామని, వాటికి ఇప్పుడు వడ్డీలు చెల్లించలేక నానా అవస్థలు

పడుతున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

కొద్ది నెలల నుంచి ప్రయివేట్ వ్యక్తులు ఏర్పాటు చేసిన మైనింగ్ చెక్ పోస్టుల వారిని ఇసుక, కంకర, ఇరత నిర్మాణ సామగ్రి తరలింపు కోసం ట్రాక్టర్‌కు రూ.వెయ్యి, లారీకి రూ.మూడు వేల చొప్పున చెల్లించాల్సి వచ్చిందని, ఖర్చులు విపరీతంగా పెరిగినా పనులు పూర్తి చేశామని అంటున్నారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగినా పనులు పూర్తి చేశామని, దీనికితోడు బిల్లుల మంజూరు కాకపోవడం తమను ఆర్థికంగా దివాళా తీస్తోందని

కాంట్రాక్టర్లకు ఎన్నికల కోడ్ భయం

అంటున్నారు. ఈ పరిస్థితులన్నింటి నేపథ్యంలో పట్టణంలో 8 మంది ఎ వన్ గ్రేడ్ కాంట్రాక్టర్లున్నా ప్రస్తుతం ఇద్దరు ముగ్గురే పనులు చేయిస్తున్నారు. ఆర్థిక ఒత్తిళ్లను తట్టుకోలేక ఇటీవల ఒక కాంట్రాక్టర్ గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆ తర్వాత కొద్ది రోజులకు ఆయనకు సంబంధించిన బిల్లుల్లో కొంత మొత్తాన్ని విడుదల చేశారు. కొంతమంది కాంట్రాక్టర్లు తమ బిల్లుల కోసం కోర్టును ఆశ్రయించారు. సిఎఫ్ఎంఎస్ సిస్టం (సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్వహణ విధానం) జనవరి ఆఖరుతో నిలిచిపోవడంతో కాంట్రాక్టర్లు చేసిన పనుల తాలుకు బిల్లులు కూడా ఆన్‌లైన్ చేసే పద్ధతి ఆగింది. ఇదెప్పుడు ప్రారంభమవుతుందో, పనులను ఆన్‌లైన్ ఎప్పుడు చేస్తారో, బిల్లులు ఎప్పుడు వస్తాయో అని కాంట్రాక్టర్లు ఆయోమయంలో ఉన్నారు. మరోవైపు ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా కోడ్ వస్తే తమ బిల్లులు ఏమవుతాయోనని ఆందోళనా కాంట్రాక్టర్లను వేధిస్తోంది.

గ్రామాల్లో తాగునీటి సరఫరాలో వివక్ష

టిడిపి, జనసేన అధ్వర్యంలో బొల్లాపల్లి ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - వినుకొండ

నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ప్రతి ఇంటికి తాగునీటిని సరఫరా చేయాలని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. నీటి సరఫరాలో అధికార పార్టీ పక్షపాతం చూపుతోందంటూ మండల కేంద్రమైన బొల్లాపల్లిలోని ఎంపిడిఒబ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో మంగళవారం ధర్నా చేశారు. జీవీ ఆంజనేయులు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కొనిజేటి నాగశ్రీను రాయల్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలందరికీ తాగునీరు సరఫరా చేయడం లేదని, టిడిపికి చెందినవారున్న ౼బజార్లకు ట్యాంకర్లను నిలిపివేయడం దుర్మార్గమని అన్నారు. నియోజకవర్గంలో ఇంటింటికీ తాగునీటి కుళాయి వేసి బుగ్గ వాగు రిజర్వాయర్ నుండి తాగునీరు సరఫరాకు టిడిపి హయాంలో రూ.640 కోట్లు విధులను వాటర్ గ్రిడ్ పథకం ద్వారా తీసుకువస్తే పథకాన్ని పూర్తి చేయలేని అసమర్థ ప్రభుత్వమని విమర్శించారు. ఈ ప్రాంతా నీటి అవసరాలు తీర్చే వరికపూడిశెల నిర్మాణంపై వైసిపికి చిత్తశుద్ధి లేదన్నారు. ఏడాది క్రితం వినుకొండలో జరిగిన సభలో సీఎం జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బొల్లాపల్లి చెరువుకు మూగచింతలపాలెం డీప్ కట్ నుంచి పైపులైను వేయించి సాగర్ జలాలను నింపి సమస్య పరిష్కారానికి రూ.12 కోట్లు కేటాయిస్తున్నానని హామీ ఇచ్చి మోసం చేశారని అన్నారు. తాగునీరు లేక బొల్లాపల్లి మండలంలో ప్రజలు వలసలు పోయే పరిస్థితి నెలకొందన్నారు. వాటర్ గ్రిడ్‌ను నిర్మించి ఉంటే ఈ సమస్య ఉండేది కాదన్నారు.

ఎమ్మెల్యే కొల్లా బ్రహ్మానా యుడు కమీషన్లకు కక్కుర్తి పడి వాటర్ గ్రేడ్ పథకాన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. తాగునీటి సరఫరాలో అధికార పార్టీ పక్షపాతం, వివక్షతను విడాలని, అటువంటి వ్యక్తులపై అధికారులు కఠిన చర్యలు తీసుకొని ఇంటింటికీ నీరందించకుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడి స్తామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌ఛార్జి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జె.గోవింద నాయక్, పి.నాగేశ్వరరావు, హనుమ నాయక్, కోట నాయక్, వెంకటేశ్వర్రెడ్డి, మన్నయ్య పాల్గొన్నారు.

అచ్చంపేటకు ఉత్తమ పంచాయతీగా అవార్డు

ప్రజాశక్తి - అచ్చంపేట

జగనన్న స్వచ్ఛ సంకల్పలో భాగంగా గ్రామీణ ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణలో అచ్చంపేట గ్రామపంచాయతీకి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రథమ స్థానం దక్కిందని అచ్చంపేట పంచాయతీ కార్యదర్శి ఏవి సుబ్బారావు మంగళవారం తెలిపారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉత్తమ పంచాయతీ అవార్డును అందుకున్నట్లు చెప్పారు. గ్రామంలో తడి చెత్త పొడి చెత్త వ్యర్థాల నుండి సంపద సృష్టించటం, వానపాములు తయారీ వంటి వాటితో పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చామన్నారు. అంతేకాకుండా ఉత్తమ క్లాప్ మిత్ర అవార్డు పంచాయతీ సిబ్బంది దేవదానానికి వచ్చినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ సీఈఓ నుండి అవార్డులు అందుకున్నట్లు చెప్పారు.

ఆత్మకూరు వద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-దుర్గి : హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్వేర్ ఇంజినీర్ కె.సాగర్‌బాబు, శాంతి స్వరూపల దంపతులకు రెండో సంతానంగా కుమారుడు జన్మించడంతో దుర్గి మండలం ఆత్మకూరులోని కాశినాయన వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదానం చేశారు. ఆశ్రమానికి 50 కిలోల బియ్యం అందజేశారు. కె.అచ్చయ్య, ఆదెమ్మ, కె.శేఖర్,సుందర్ పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు అధికారులు కదలాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వ శాఖలు అడుగులేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ చెప్పారు. విద్య ద్వారానే బాలికల భవిష్యత్తు ఉన్నత స్థాయికి చేరుతుందని, సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని అన్నారు. 'బేటీ బచావో - బేటీ పడావో' కార్యక్రమంపై మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులను ప్రస్తావించారు. జువైనైల్ జస్టిస్ యాక్ట్, బాల్యవివాహాల నిరోధక చట్టం, దిశా యాక్ట్, యాప్, ఫోక్సో యాక్టివ్ వంటి చట్టాలు గ్రామస్థాయిలో ప్రజలందరికీ అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లా మహిళా సంక్షేమ శాఖ పీడీ ఉమారాణి మాట్లాడుతూ వచ్చేనెల 8వ తేదీలోగా

కుట్టు శిక్షణ ప్రారంభంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

ఐసిడిఎస్ ప్రణాళిక బద్ధంగా తయారు చేసుకోవాలని చెప్పారు. జువైనల్ జస్టిస్ యాక్ట్ గురించి జువైనల్ జస్టిస్ బోర్డు మెంబర్ ఎం.శ్రీనివాస్, పోక్సో చట్టం, బాలల హక్కుల చట్టం గురించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ సి.హెచ్.రాజకుమారి వివరించారు.

ప్రతి నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్‌హబ్‌ను ఏర్పాటు చేసి వాటి ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతోపాటు ఉపాధి చూపుతామని కలెక్టర్ చెప్పారు. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ఏర్పాటు చేసిన నాక్ ట్రైనింగ్ సెంటర్ స్కిల్‌హబ్‌లో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణను మంగళవారం ప్రారంభించారు. ఉద్యోగాల ద్వారానే కాకుండా స్వయం ఉపాధి రంగంలోనూ పురుషులకు దీటుగా మహిళలు రాణిస్తున్నారన్నారు. కుట్టు శిక్షణ పొందినవారంతా ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్, స్కిల్ డెవలప్‌మెంట్ (నవోదయం) సంజీవరావు, సర్వశిక్ష అభియాన్ అధికారిని రేవతి, సిడిపిఒలు ఎం.అనురాధ, శ్రీలత, శ్రీవల్లి, శాంతకుమారి, జిల్లా ప్రరిశ్రమల శాఖాధికారి జి.వెంకటేశ్వర్లు, నాక్ అదనపు డైరెక్టర్ నరసింహారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
గుంటూరు 5
బుధవారం 28 ఫిబ్రవరి 2024

1వ తేదీ నుండి అగ్ని ప్రమాద బాధిత పసుపు రైతుల రిలేదీక్షలు


దుగ్గిరాల సమావేశంలో మాట్లాడుతున్న జొన్నా శివశంకర్, తెనాలిలో ఎమ్మెల్యే కి వినతి పత్రం ఇస్తున్న పసుపు రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి దుగ్గిరాల: మార్చి ఒకటో తేదీన స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద కోల్డ్ స్టోరేజ్ లో పసుపు నిల్వచేసి అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించనున్నట్లు పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకర్ తెలిపారు .దుగ్గిరాలలో మంగళవారం జరిగిన ఒక సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సంఘం నాయకులు ప్రారంభ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు .అగ్ని ప్రమాదానికి సంబంధించిన అన్ని రకాల వివరాలు తెలుపాలన్నారు. కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యంతో రైతు సంఘ నాయకులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి వై బ్రహ్మేశ్వర రావు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు బి అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పసుపు రైతుల్ని ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి తెనాలి :ఇటీవల దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులను ఆదుకోవాలని కోరుతూ పసుపు రైతు సంఘ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు ఆయన నివాసంలో వినతి పత్రం ఇచ్చారు. ప్రమాదం జరిగి దాదాపు 40 రోజులు కావస్తున్నా పరిహారం విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని వివరించారు. రైతులను ఆదుకునేందుకు తగు చర్యలు తీసుకో వాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో నాయకులు ములకా శివసాంబిరెడ్డి, వేముల వెంకటరామయ్య, చంద్రశేఖర్. భీమవరపు చినరామిరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ బాధిత రైతులను ఆదుకోవాలి : సిపియం

ప్రజాశక్తి-గుంటూరు : దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజ్ దగ్ధమై నష్టపోయిన పసుపు రైతులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని, లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కోల్డ్ స్టోరేజీ దగ్ధమై 40 రోజులు అవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించలేదన్నారు. సుమారు 250 మంది రైతులు 60 వేల బస్తాలు కోల్డ్ స్టోరేజీలో దాచుకున్నారని, పంటలకు గిట్టుబాటు ధర రాక శీతల గిడ్డంగులలో ఉంచారన్నారు. అనేక వ్యయ ప్రయాసలకోర్చి అప్పుచేసి పంట పండిస్తే పంట అగ్నికి ఆహుతి కావడం రైతాంగాన్ని కలిచి వేస్తుందన్నారు. అధికారులు పేర్లు నమోదు చేసుకోమని ఆదేశించారని, కానీ ఇంతవరకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. రైతులు వివిధ సంఘాల ఆధ్వర్యంలో దుగ్గిరాల, తెనాలిలలో దశలవారీగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించట్లేదని విమర్శించారు. నిరంతరం రైతుల కోసం పనిచేస్తున్నామని ప్రభుత్వం చెప్పుకుంటున్నా ఆచరణలో రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం ఇవ్వాలని లేనిచో ఆందోళనకు పూనుకుంటామన్నారు.

రాజధాని రైతులకు తక్షణమే కౌలు చెల్లించాలి

సిపిఎం రాజధాని కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని రైతులకు తక్షణమే కౌలు చెల్లించాలని సిపిఎం రాజధాని డివిజన్ కమిటి డిమాండ్ చేస్తుందని రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిఐడి విచారణ పేరుతో మూడేళ్లుగా అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించడం లేదని, దళితులు, ఇతర పేద వర్గాలకు చెందిన అసైన్డ్ రైతులు ఉపాధి లేక, కౌలు సొమ్ము కూడా దక్కక ఎలా జీవనం సాగిస్తారని ప్రభుత్వాన్ని నిలదీసింది. 2023 మే నెలలో అమరావతి రాజధాని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వార్షిక కౌలు ను 10 నెలలు గడుస్తున్నా ఇదిగో, అదిగో చెల్లిస్తున్నాం అంటూ కాలయాపన చేయడం తప్ప నేటి వరకు రైతులకు కౌలు చెల్లించకపోవడం, అమరావతి రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికైనా రైతుల పట్ల కక్ష సాధింపు చర్యలు మానుకొని రైతులకు,అసైన్డ్ రైతులకు చెల్లించాల్సిన వార్షిక కౌలును తక్షణం చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం ,సి ఆర్ డి ఏ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.కౌలు చెల్లింపు నిమిత్తం రూ 240 కోట్లు విడుదల చేసామంటూ సి ఆర్ డి ఏ కమిషనర్ ఆర్భాటపు ప్రకటనలు చేయడం తప్ప, రైతుల అకౌంట్ల లో రూపాయి జమ చేయలేదన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వము అధికారులు ఉత్త మాటలు చెప్పడం మాని కౌలు చెల్లింపుకు చర్యలు చేపట్టకపోతే సి ఆర్ డి ఏ కార్యాలయం వద్ద రైతులను సమీకరించి సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

విగ్రహావిష్కరణలో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, ఎమ్మెల్యే

తెనాలి బండ్‌పై తొలి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి తెనాలి

పట్టణ సుందరీకరణలో భాగంగా హైదరాబాదు ట్యాంక్ బండ్‌ను తలపించే విధంగా పట్టణంలో తెనాలి బండ్ ముస్తాబవుతోంది. తెనాలి-విజయవాడ రోడ్డులో ఏర్పాటు అవుతున్న బండ్ పై తెనాలి ప్రాంతానికి వన్నెతెచ్చిన కవులు, కళాకారులు, రాజకీయ, శాస్త్ర, సాంకేతిక రంగ ప్రముఖుల విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. దానిలో భాగంగా తొలిగా ఏర్పాటు చేసిన జాతీయ వాది, అర్చకోద్యమ పితామహులు తమిరిశ రామా చార్యులు కాంస్య విగ్రహాన్ని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి, శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తెనాలి బండ్ పట్టణ ప్రాంతానికి వన్నె తేవడమే కాకుండా, భావితరాలకు ఈ ప్రాంత ప్రముఖుల విశేషాలను తెలియజేసేందుకు దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, ఎడ్లపాటి రఘునాధ బాబు, పి రామకృష్ణ, శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, అనంతాచార్యులు పాల్గొన్నారు.

గ్రామంలో శుభ్రం చేస్తున్న హిందూ కళాశాల విద్యార్థులు

ఎన్ఎస్ఎస్ క్యాంప్‌లో పాల్గొన్న చలపతి ఫార్మసీ విద్యార్థులు

రోడ్లు శుభ్రం చేస్తున్న బిహెచ్ కాలేజి విద్యార్థినులు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పేరం నాగేశ్వరావు

గ్రామాల్లో పలు కళాశాలల విద్యార్థుల సామాజిక సేవ

5వ రోజు హిందూ కాలేజీ విద్యార్థుల క్యాంప్

ప్రజాశక్తి-గుంటూరు

హిందూ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ మండలంలోని లక్ష్మీ నరసింహపురం గ్రామంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న స్పెషల్ క్యాంపు శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ పీఎంప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.యస్ దుర్గాప్రసాద్, ఐక్యూఎసి కోఆర్డినేటర్ డాక్టర్.పి.వేణుగోపాల్ మంగళవారం నాడు సందర్శించారు. ఇటువంటి శిబిరాలలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల మధ్యలో క్రమశిక్షణ, ఐకమత్యం, ఇతరులతో కలిసి పనిచేయటం అలవాటు అవుతాయని ప్రిన్సిపాల్ అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హిందూ కళాశాల ఎన్ఎస్-ఎస్ విభాగం ఎప్పుడూ సేవా కార్యక్రమాల్లో ముందు ఉంటుందని, కార్యక్రమాలు చేసిన ప్రతిచోట ప్రజల మన్ననలను పొందుతుందని పేర్కొన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.వి.రాము మాట్లాడుతూ గురువారం వెంగళాయపాలెంలో ప్రభుత్వ హెల్త్ డిపార్ట్మెంట్ సహకారంతో జనరల్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని చెప్పారు.

పచ్చదనం, పరిశుభ్రతపై చలపతి విద్యార్థులు అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు :లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ సహకారంతో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ విభాగం-2 వారు నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్ రెండో రోజు 'పచ్చదనం, పరిశుభ్రత, పదార్థ దుర్వినియోగం అనే అంశంపై జొన్నలగడ్డలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గాలి, భూమి శుభ్రంగా ఉంచినట్లయితే మంచి ఆరోగ్యకరమైన జీవితం సాధ్యం అవుతుందని, పచ్చదనం పెంపుదలకు మొక్కలు నాటాలని విద్యార్థులు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పంచాయితీ సభ్యులు ఐదయ్య, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రొఫెసర్ కె.యస్.రజినీకాంత్ పాల్గొన్నారు.

కైలసగిరి కొండపై బిహెచ్ విద్యార్థుల క్యాంప్

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ మహిళా కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-1 దత్తత గ్రామమైన వెంగళాయ పాలెంలో వారం రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం కైలాసగిరి కొండపై స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. కౌసల్యాదేవి పాల్గొని మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం, అపరిశుభ్రత వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. చెత్తాచెదారం ఎక్కువగా పేరుకుపోయి దోమలు, ఈగలు పెరిగి రోగాలు ప్రబలుతున్నాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమ నిర్వహణ అధికారి యం. గిరిజ, లక్ష్మీదీప్తి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై మహిళా కాలేజీ విద్యార్థుల అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక 25వ వార్డు జోసఫ్‌నగర్, కష్ణబాబు కాలనీలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజి ఎన్ఎస్ఎస్ విభాగం-2 వారు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి.ధాత్రికుమారి నేతృతంలో జరుగుతున్న స్పెషల్ క్యాంప్ 4వ రోజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు జోసెఫ్ నగర్ హైస్కూల్లో విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం, ఐరన్ కాల్షియం కలిగిన ఆహారం తీసుకోవడం గురించి, శుద్ధమైన నీటిని తాగడం విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం గురించి, సైబర్ నేరాలను గురించి, జంక్‌ఫుడ్ తినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్లాస్టిక్ వస్తువుల దుష్ఫలితాల గురించ అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెఛ్ఎం ఎన్.దేవపాల్, అధ్యాపకులు కె.సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

బ్లీచింగ్ చల్లుతున్న మహిళా కాలేజీ విద్యార్థులు

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది

175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాలకు పోటీ

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి మళ్లించారని విమర్శలు

ప్రజాశక్తి మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలకు, 25 పార్లమెంటు స్థానాలకు పోటీ చేస్తామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరావు వెల్లడించారు. మంగళవారం మంగళగిరి నగరంలోని ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నాగేశ్వరావు మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి నమ్మి ఆయన కుమారుడైన వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రజలు ఓట్లేసి గెలిపించారని ఏ ఒక్క సామాజి వర్గానికి కూడా మేలు చేయలేదని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో కొత్తగా ఒక పరిశ్రమ గాని, ప్రాజెక్టునిగాని నిర్మించలేదని కనీసంగా పోలవరం ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని నాగేశ్వరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత యువకులకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను నవరత్నాలు, ఇతర పథకాలకు ఎందుకు మళ్లించారని అధికారం ముఖ్యమంత్రి ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. ఈ మీడియా సమావేశంలో రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా ఓబిసి రాష్ట్ర అధ్యక్షులు పరస రంగనాథ్, మైనార్టీ నాయకులు వలి ఆసిఫ్ భాష, శివ, తోట ఫణీంద్ర , శ్రీకాంత్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

బాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని టిడిపి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సత్తెనపల్లి రఘురాం నగర్‌లోని టిడిపి ప్రజావేదికలో మంగళవారం బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్చార్జిలతో లక్ష్మీనారాయణ సమావేశమయ్యారు. అనంతరం 15వ వార్డులో కన్నా లక్ష్మీనారాయణ ప్రచారం చేశారు. తాము అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు. నవరత్నాల పేరుతో జగన్మోహన్ రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నాడని అన్నారు. ఇంటింటికి తిరిగి మ్యానిపెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయనకు టిడిపి శ్రేణులు ఘనస్వాగతం పలికారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి యెలినేడి రామస్వామి, రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు పాల్గొన్నారు.

గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలి

ప్రజాశక్తి - బెల్లంకొండ

వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలని టిడిపి నాయకులకు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ చెప్పారు. నియోజకవర్గంలో వివిధ హోదాల్లో పని చేస్తున్న 1500 మందితో ఆయన మంగళవారం తన కార్యాలయం నుండి టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రతిరోజూ ఓటర్లతో మమేకమవ్వాలని, కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఇస్తామని అన్నారు. నియోజకవర్గంలో శంఖారావం అనే కార్యక్రమం నిర్వహణకు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలను విస్మరించిన ఎమ్మెల్యే సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారని, అనుమతులు లేకుండా ఇసుకను తరలించి రూవందల కోట్లు సంపాదిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో మరొకసారి ప్రజలను మభ్యపెట్టడానికి కుక్కర్లు, చీరలు దొడ్డి దారిన పంపిణీ చేయడం మోసపూరితమన్నారు.

చెత్తపై పన్ను వేసిన వారికి బుద్ధి చెప్పండి

ప్రజాశక్తి - మాచర్ల

టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు దీపం పథకం క్రింద ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్లను ఉచితంగా అందజేస్తామని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని 26వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి, జనసేన పార్టీలు మంగళవారం చేపట్టాయి. ఈ సందర్భంగా యాగంటి మల్లికార్జునరావు మాట్లాడుతూ చెత్తపై పన్ను వేసిన వైసిపి పార్టీకి ప్రజలు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. మీ ఇంట్లో ఎంత పిల్లలు చదువుతుంటే అంత మంది పిల్లలకు రూ.15 వేలు చోప్పున బాబు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఆడబిడ్డ నిధి పథకం క్రింద 18 ఏళ్ళు నిండిన ప్రతి స్త్రీకి నెలకి రూ.1,500 చొప్పున అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎనుముల కేశవరెడ్డి, కె.దుర్గారావు, బాబుఖాన్, ఎం.చినవెంకట రామిరెడ్డి, గురవారెడ్డి, జానీబాషా, నాగూర్, శివపార్వతీ, ప్రసాదు, లక్ష్మణ్, లాలాక్రిష్ణ, మదీన్ పాల్గొన్నారు.

ప్రజ్ఞా వికాస పరీక్ష ప్రశ్నాపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పదో తరగతి విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండే ప్రజ్ఞా వికాసం పరీక్ష ప్రశ్నాపత్రాలను పట్టణంలోని పల్నాడు హాస్పిటల్‌లో మంగళవారం ఆవిష్కరించారు. డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్, పుల్లారెడ్డి హైస్కూల్ హెచ్‌ఎం ఎల్.ధనలక్ష్మి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ సారథి, మండల నాయకులు శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కోట సాయికుమార్, పిడుగురాళ్ల కార్యదర్శి లక్ష్మణ్, రోహిత్ ఈ పత్రాలను ఆవిష్కరించారు. డాక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్, జెవివి ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజ్ఞా వికాస పరీక్షను అందరు విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులు ఏ విధంగా పబ్లిక్ ఎగ్జామ్ రాయాలో వారికి తెలియజేస్తూ పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావాలో తెలియజేశారు. విజయ సారధి, ధనలక్ష్మి మాట్లాడుతూ పరీక్షలకు ఏ విధంగా చదివితే మంచి మార్కులు సాధించొచ్చు చెప్తూ ఒక ఉన్నతమైన విద్యార్థిగా మారాలంటే ఏ విధంగా చదవాలో చెప్పారు. క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమన్నారు. సాయికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి తమ సత్తాను నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు శ్రీనివాస్‌రావు, ఎస్ఎఫ్ఐ నాయకులు లక్ష్మణ్, లతీబ్, రోహిత్, యాసిన్ పాల్గొన్నారు.

మా సమస్యలను మేనిపెస్టోలో చేర్చండి

కన్నా లక్ష్మీనారాయణకు యుటిఎఫ్ నాయకుల వినతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఉపాధ్యాయుల సమస్యలను టిడిపి మ్యానిపెస్టోలో పెట్టాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణను మంగళవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని, పిఆర్సీ డిఎ బకాయిలను విడుదల చేయాలని, ఉద్యమాలు సందర్భంగా ఉపాధ్యాయులపై వైసిపి ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తివేయాలని, ఉపాధ్యాయులకు వేతనాలు, పెన్షనర్స్‌కు పెన్షన్లు సకాలంలో. విడుదల చేయాలని కోరారు. ఈ అంశాలను టిడిపి మేనిఫెస్టోలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల డిమాండ్లను టిడిపి అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళి మ్యానిపెస్టోలో పెట్టే విధంగా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ సారధి, ఆడిట్ కమిటీ సభ్యులు కిషోర్ కుమార్, సత్తెనపల్లి మండల అధ్యక్షు కార్యదర్శులు రవీంద్రనాథ్ ఠాగూర్, విష్ణుమూర్తి, గౌరవాధ్యక్షులు పొన్నం వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులు పి.రమేష్‌బాబు, ఆర్థిక కార్యదర్శి శేషిరెడ్డి, పద్మావతి, నాగకుమారి, రజనికుమారి, అనురాధ పాల్గొన్నారు.

అనుచరులతో కోడెల శివరాం సమావేశం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

టిడిపి అసమ్మతి నేత కోడెల శివరాం తన అనుచరులతో సత్తెనపల్లిలోని కోడెల కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. ఏమి చేద్దామని తన అనుచరులతో ప్రస్తావించగా.. ఏ నిర్ణయం తీసుకున్నా మీ వెంటే ఉంటామని వారు చెప్పానట్లు తెలిసింది. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తానని శివరామ్ చెప్పారని సమాచారం. ఇదిలా ఉండగా సత్తెనపల్లి నుండి టిడిపి తరుపున ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించి బంగపడిన ఆయన ఇప్పటికే ఇన్‌ఛార్జిగా నియమితులైన కన్నా లక్ష్మీనారాయణపై అసమ్మతి గళం విప్పారు. గతంలో తన తండ్రి మరణాంతరం సత్తెనపల్లి సీటు తనకే కేటాయించాలని డిమాండ్ చేశారు. టిడిపి అధినేత చంద్రబాబుపై కూడా పలు ఆరోపణలు గుప్పిచారు. కన్నా లక్ష్మీనారాయణకు పోటీగా సత్తెనపల్లి నియోజకవర్గంలో టిడిపి కార్యక్రమాలు కోడెల శివరాం నిర్వహించారు. దీనిపై టిడిపి అదిష్టానం ఆగ్రహం వ్యక్తం చేయడంతో కోడెల శివరాంతో ఉన్న టిడిపి నాయకులు ఒక్కొక్కరు ఆయన్ను వీడి కన్నా లక్ష్మీనారాయణ వైపు వచ్చారు. మరోవసపు కోడెల శివరాం ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారని ప్రచారమవుతోంది.

కాంగ్రెస్ గ్యారెంటీని ఇంటింటికీ తీసుకెళ్తాం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కాంగ్రెస్ పార్టీ మొదటి గ్యారెంటీ ప్రతి పేదవా కుటుంబానికి రూ.5 వేల పథకం ప్రకటించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్చార్జి చొక్కా చంద్రపాల్ అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. అనంతపురం కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో మేనిఫెస్టోలో భాగంగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర అధ్యక్షులు షర్మిలారెడ్డి 'ఇందిరా అభయహస్తం' పేరున ఎలక్షన్ మ్యానిఫెస్టో ప్రకటించడం శుభ పరిణామమన్నారు. దీనిపై ఇంటింటికీ వెళ్లి వివరిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు డి.జ్ఞానరాజ్‌పాల్, పిసిసి కార్యదర్శి ఎం.వేదాద్రి, పల్నాడు జిల్లా కార్యదర్శి టి.కృష్ణమూర్తి, సీనియర్ నాయకులు,. వ్యాపారవేత్త అజీమ్, ముప్పాళ్ళ మండల ఇన్చార్జి కె.ఆనంద్, బీసీ సెల్ నాయకులు ఎం.శంకర్రావు, నాయకులు గఫూర్, జి.కన్నా, జె.శేఖర్, హనుమంతరావు, గౌతమ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

రానున్న ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి పేదవాని ఇంటికి నెలకు రూ.5 వేలు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ డాక్టరు యరమల రామచంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమలు చేసే మొదటి గ్యారెంటీ పథకం నెలకు రూ.5 ఇవ్వడం అని అనంతపురం బహిరంగ సభలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే ప్రకటించడ హర్షణీయమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు, 140 కోట్ల మంది ప్రజల ఖాతాలలో రూ.15 లక్షల జమ, రాష్ట్రంలోని వైసిపి, టిడిపిలు ఇచ్చిన హామీలు కూడా అమలు కాని విషయాలు ప్రజలకు తెలుసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు షేక్ బాబు, ఉప్పు గౌరి పాల్గొన్నారు.

కోటప్పకొండ మార్గాల్లో కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మహాశివరాత్రి సందర్భంగా వచ్చేనెల 8న కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా లక్షల సంఖ్యలో రానున్న సందర్శకుల, ప్రజల రాకపోకులకు అంతరాయం లేకుండా ఏర్పాటు చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. నరసరావుపేట మండలం యలమంద గ్రామం వద్ద నిర్మించిన బ్రిడ్జిని కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. జవహర్ కాల్వ (చిలకలూరిపేట మేజర్)ను పరిశీలించారు.

ఆనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం కొత్తపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న అందుగుల మోషే, హిమామ్ సాహెబ్ కుటుంబాలకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశాలతో నాయకులు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా కార్యదర్శి ఆర్.సైదారావు, శ్రీను నాయక్, శ్రీను యాదవ్, రవి, శ్రీరామ్ మూర్తి, గోపిరాజు, బ్రహ్మారెడ్డి, జి.బాబు, ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

'ప్రైవేటు'లో ఉచిత విద్యకు అవకాశం

ప్రజాశక్తి - పెదకూరపాడు

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య కోసం వచ్చేనెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒలు ఏకుల ప్రసాదరావు, తాడిశెట్టి సత్యనారాయణ మంగళశారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని,, ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని సూచించారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎమ్‌డి ఖాసిం

ప్రజాశక్తి - మంగళగిరి, మంగళగిరి రూరల్

మండలంలోని ఎర్రబాలెం మరియు మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి యం.డి.ఖాసిం తనిఖీ చేశారు. యర్రబాలెం గ్రామంలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులు ఫార్మేటివ్ పరీక్ష లో సాధించిన ప్రగతిని సమీక్షించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉర్దూ భాష తప్పక బోధించాలని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం జగనన్న గోరుముద్ద ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థులతో పాటు సహపంక్తి భోజనం చేశారు. ఉపాధ్యాయులకు ఫార్మేట్ పరీక్షలో విద్యార్థులు సాధించిన మార్కులను త్వరితగతిన ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి సరుకులు పంపిణీ

ప్రజాశక్తి మంగళగిరి: దుగ్గిరాల మండలంలోని మంచికలపూడి గ్రామంలో శివయ్య, ఈశ్వరమ్మ అను నిరుపేద దంపతులకు ప్రతి నెల లాగానే ఈ నెల కూడా నెలవారి సరుకులు బీసీ సంక్షేమ సంఘం మరియు స్వర్ణకార సంఘాల గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ తన సొంత నిధులతో మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరు హనుమంతరావు, గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షుడు వుడతా శ్రీనివాస్ రావు, జాయింట్ సెక్రటరీ తిరువీధుల వీధుల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి దుగ్గిరాల : జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ఘన వ్యర్ధ పదార్థాల నిర్వహణ సమర్ధవంతంగా నిర్వహించినందుకు దుగ్గిరాల గ్రామ సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్ కార్యదర్శి ఎం శరత్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గోపి గ్రీన్ అంబాసిడర్ సాంబయ్య నాయక్ లకు ఉత్తమ ప్రతిభ పురస్కారాలు అందజేశారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సీఈవో మోహనరావు వీరికి ప్రశంస పత్రాలు అందజేశారు.

త్రిపుర గవర్నర్ దేవాలయం సందర్శన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి భగవాన్ శ్రీ సత్య షిరిడి సాయిబాబా మందిరాన్ని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి మంగళవారం సందర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. ఆలయం వద్ద గలగోశాలను కూడా సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ప్రాతూరి శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

సంజీవనగర్‌లో కలుషిత నీరు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి మున్సిపల్ ట్యాపుల ద్వారా వస్తున్న మంచినీరు స్థానిక సంజీవ నగర్‌లో కలుషిత నీరుగా వస్తుంది. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో జ్వరాలు విజృంభించడంతో డయేరియా లాంటి రోగాలు

కలుషిత నీరు

వస్తాయేమోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు దృష్టికి తాము తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ధామస్ అనే వ్యక్తి చెబుతున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇదే విధంగా నలకలతో కూడిన కలుషిత నీరు వస్తుందని దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధికారులను కోరారు.

పోరాట యోధుడు చంద్రశేఖర్ ఆజాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్వాతంత్ర్య మహాసంగ్రామంలో అసువులు బాసిన చంద్రశేఖర్ ఆజాద్ 93వ సంస్మరణ సభ మంగళవారం గుంటూరు బి.ఆర్ అంబేద్కర్ భవన్లో జరిగింది. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పిడిఎం) జిల్లా కన్వీనర్ డి.సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో నేటికీ దోపిడీ అణిచివేత, అసమానతలు కొనసాగుతున్నాయన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రజల ఆస్తులను పెట్టుబడిదారులకు అమ్మేస్తూ ప్రశ్నించిన ప్రజా స్వామిక వాదులపై, ప్రజలపై తప్పు కేసులు పెడుతూ ప్రజల గొంతును నొక్కేస్తుందన్నారు. పిడిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు పాలన సాగించిన కాంగ్రెస్, గత పది సంవత్సరాల నుండి పలన చేస్తున్న బిజెపి పార్టీ కి విధానపరంగా ఎలాంటి మార్పు లేదన్నారు. ప్రజలపై అధిక ధరలు మోపుతూ నిరుద్యోగం పెరగడానికి ఈ రెండు పార్టీలే కారణం అన్నారు. విజయ్ మాల్యా,నీరవ్ మోడీ లాంటి అనేకమంది పరిశ్రమల పేరుతో వేలాదికోట్ల రూపాయల బ్యాంకుల నుండి దోచుకొని తిరిగి బ్యాంకులకు అప్పు చెల్లించకుండా ఎగొట్టి విదేశాలకు పారిపోయిన వారిపై బిజెపి ప్రభుత్వం చట్టపరమైన ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అంతేగాక కార్పొరేట్ సంస్థలకు సంబంధించిన వేలాది కోట్ల రూపాయల రుణాలను రద్దు చేశారు అన్నారు. విరసం సీనియర్ నాయకులు సి.ఎస్.ఆర్ ప్రసాద్, విసికే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె.జయసుధ, రైతు కూలీ సంఘం నాయకులు నాదెండ్ల బ్రహ్మయ్య,దళిత ఉద్యమ వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గంటా ప్రభుదాస్,ఏరువాక రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు,బీసీ మహాజనసభ రాష్ట్ర అధ్యక్షులు ఉగ్గం సాంబశివరావు, భారత్ బచావో గుంటూరు కష్ణాజిల్లాల సమన్వయకర్త కోలా నవ జ్యోత్, కవి రచయిత బత్తుల విల్సన్, న్యాయవాది సిఖా సురేష్, దళిత నాయకురాలు బోడపాటి కాంతం, తదితరులు పాల్గొని ప్రసంగించి కామ్రేడ్ చంద్రశేఖర్ ఆజాద్ కి నివాళులర్పించారు.

తెనాలిలో ఎంపి అభ్యర్థి పెమ్మసాని పరిచయ కార్యక్రమం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రక్తాన్ని పసుపుతో నింపుకున్న కార్య కర్తలకు, నాయకులకు అభివందనమని టిడిపి నాయకులు, గుంటూరు ఎంపి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. తెనాలి నియోజవర్గం తెలుగుదేశం పా ర్టీ ఆత్మీయ పరిచయ సమావేశం స్థానిక ఎన్వీఆర్ కల్యాణ మండపంలో మంగళవారం జరిగింది. కార్యక్రమంలో ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పెమ్మసాని, ఆలపాటి పూలమాల వేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ కార్యకర్తల కోసం నిరంతరం పాటుపడ్డ అతి తక్కువ మంది నాయకుల్లో ఆలపాటి ఒకరని అన్నారు. నియోజక వర్గంలో ముఖ్యంగా టిడిపి మహిళల గురించి మాట్లాడాలంటే వైసీపీ వాళ్లు ఎన్ని రకాలుగా వేధించినా మహిళా కార్యకర్తలు టిడిపి తరపున నిరంతరం పోరాడుతూనే ఉన్నారన్నారు. అమర్ రాజా వంటి ఫాక్టరీ ఎన్నో వేల మందికి అన్నం పెడుతున్నదని తెలిసినా, ఆ ఫ్యాక్టరీ రాష్ట్రం నుంచి వెళ్ళిపోయే వరకు జగన్ నిద్రపోలేదని చెప్పారు. హైదరాబాదు నుంచి విజయవాడకు ప్రశాంతంగా ప్రయాణించగలమని కానీ, విజయవాడ నుంచి తెనాలి రావాలంటే రోడ్లు గుంతలతో నరకప్రాయమేనన్నారు. టిడిపి కష్టకాలంలో ఉన్న సమయంలో పవన్ కళ్యాణ్ చేయి అందించాడన్నారు. ఐదు ఏళ్ల సేవకు కాదు ముప్పై ఏళ్లు పాతుకుపోవడానికి వచ్చానని అన్నారు.అనంతరం నియోజ కవర్గ మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అన్ని దానాల కంటే విద్యా దానం గొప్పదని నమ్మిన వ్యక్తి డాక్టర్ పెమ్మసాని అని కొనియాడారు. నేడు అమెరికాకు వెళ్లి వైద్య విద్య అభ్యసించాలనుకునే ప్రతి విద్యార్థికీ డాక్టర్ పెమ్మసాని జర్నల్ ఎంతగానో ఉపయోగపడుతుందని, ఒకరికొకరు అండగా నిలబడ్డ పెమ్మసాని సోదరులు త్వరలో ప్రజలకు కూడా అండగా ఉంటామని ఉమ్మడి భరోసా ఇస్తూ ముందుకు వస్తున్నారన్నారు. తాను 3 రోజుల క్రితం కలిసినప్పుడు తన గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదని చంద్రబాబు తనతో చెప్పారని, ఎలా న్యాయం చేయాలో తమకు వదిలేయమని బాబు, లోకేష్ తెలిపారని ఈ సందర్భంగా కార్యకర్తలకు ఆలపాటి వివరించారు. గతంలో ఈ పార్లమెంటు తెనాలి పేరు మీదనే ఉండేదని, విభజిత జిల్లాల తర్వాత గుంటూరు పార్లమెంటుగా మారిన నేపథ్యంలో పెమ్మసాని రాక తర్వాత అయినా ఈ పార్లమెంటుకు తెనాలి పేరు పెట్టేలా చూడాలని పెమ్మసానిని ఆలపాటి కోరారు. కార్యక్రమానికి టిడిపి నాయకులు డాక్టర్ దక్షిణామూర్తితో పాటు గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న పెమ్మసాని


సభలో పాల్గొన్న ఆలపాటి, పెమ్మసాని

చిరు వ్యాపారులకు లోకేష్ చేయూత

ప్రజాశక్తి మంగళగిరి :టిడిని జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మంగళగిరి పట్టణ చిరువ్యాపారులకు చేయూత నందించారు. మంగళగిరి పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు అధ్యక్షతన మంగళవారం రాత్రి పట్టణంలోని చిరు వ్యాపారుల జీవన ఉపాధి కోసం వివిధ రకాల బళ్లు, వెల్డింగ్ మిషన్లు, సెలూన్ చైర్లను ఆల్ఫా హోటల్ వద్ద అందజేశారు. 6గురికి టిఫిన్ బళ్లు, 8మందికి తోపుడు బళ్లు, 10 మందికి వెల్డింగ్ మిషన్లు, 4గురికి సెలూన్ చైర్లను ఉచితంగా టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి

నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, పట్టణ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల ఛార్జీలు తగ్గింపు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రైలు ప్రయాణికులకు కేంద్రం శుభవార్త చెప్పింది. 2020లో ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చిన పాసింజర్ రైళ్లలోని సెకండ్ క్లాస్ ఆర్డినరీ చార్జీలను పునరుద్ధరించింది. దీంతో టికెట్ ధరలు 50 శాతానికి పైగా తగ్గాయి. గతంలో మేము/డెమో ఎక్స్‌ప్రెస్ ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్ స్పెషల్స్ గా మార్చడంతో కనీస టికెట్ ధర రూ 10 నుంచి రూ 30కి కేంద్రం పెంచింది. ప్రయాణికుల నుంచి విమర్శలు రావడంతో ప్రభుత్వ తాజాగా ధరలను పునరుద్ధరించినట్లు తెనాలి స్టేషన్ సూపరింటెండెంట్ టి రవీంద్ర తెలిపారు. తెనాలి- బాపట్ల, తెనాలి-రేపల్లె, తెనాలి-గుంటూరు, తెనాలి- విజయవాడకు మినిమం చార్జి పది రూపాయలుగా ప్రకటించినట్లు తెలిపారు. మంగళవారం నుండి అమలులోఉన్నట్లు తెనాలి స్టేషన్ ఎస్ఎస్ తెలియ జేశారు.

3వ తేదీన జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి

మార్చి మూడో తేదీ ఉదయం 9 గంటలకు జిల్లా పవర్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు మంగళగిరి పిట్ జోన్లో జరుగుతున్నట్లుగా గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. జిల్లాలో ఉన్న పవర్ లిఫ్టర్లందరూ ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. వివరాలకు 9700844497, 9346307979 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి-తెనాలి

హౌసింగ్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారు వెల్లడించన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా వరికూటి వారిపలెంకు చెందిన నండూరు అచ్యుత వెంకటరామ్ పట్టణంలో ఓ ప్రైవేట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. ఆయన స్థానిక జగ్గడిగుంటపాలెం టిడ్కో గృహసముదాయంలో ఉంటున్నాడు. ఈనెల 24న ఫైనాన్స్ కంపెనీ మేనేజర్ ఫోన్ చేసి అచ్యుత వెంకటరామ్‌ను కార్యాలయానికి రావాల్సిందిగా కోరారని, వస్తున్నట్లు చెప్పి ఇంటినుంచి వెళ్ళిన అచ్యుత వెంకటరామ్ తిరిగి ఇంటికి రాకపోగా ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడని అతని తండ్రి నండూరి వెంకటసుబ్బారావు పోలీసులకు పిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి-తెనాలి

అదనపు కట్నం కోసం వేదిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ గ్రామం కొలకలూరు పంచాయతీ పరిధిలోని ఖాజీపేటకు చెందిన పులిగడ్డ దివ్య అలియాస్ బుజ్జిని ఆమె భర్త శ్రీనివాసరావు, అత్త అదనపు కట్నం కోసం వేదిస్తున్నారని, శారీరకంగా, మానసికంగా తనను హింసిస్తున్నారని పోలీసుకు పిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న డిఎంహెచ్ఒ

డిఎంహెచ్ఒ గ్రీవెన్స్‌కు 34 అర్జీలు

ప్రజాశక్తి-గుంటూరు

వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల జీతభత్యాలు, తదితర సమస్యల పరిష్కారానికి డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ కె.విజయలక్ష్మి తన ఛాంబర్‌లో మంగళవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ గ్రీవెన్స్‌లో 34 దరఖాస్తులు అందాయి. జిల్లా అధికారి పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, ఇతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని డిఎంహెచ్ఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ జయరామకృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ ప్రదర్శనకు అవార్డులు

ప్రజాశక్తి-గుంటూరు

అవార్డులు అందచేస్తున్న జెడ్పీ ఏఒ శ్రీనివాస్, తదితరులు

ఐటిసి బంగారు భవిష్యతు, సెర్ప్, ఫినిష్ సంస్థ, జిల్లా పంచాయతీ వానరుల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం అవార్డుల ప్రదానోత్సవం మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిలాల్లో ఉత్తమ పని తీరు ఎంపిడీఓలు, ఈఓపిఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, క్లాప్ మిత్రలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ డిప్యూటీ సిఇఒ మోహన్‌రావు, ఏఒ శ్రీనివాసరావు, సెర్ప్ సంస్థ సెక్రెటరీ పార్థసారథి, ఐటీసీ పిఒ సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఈ కార్యమ్రకం నిర్వహించటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో నాగరాజు, శ్రీనివాసరావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వస్తు వినియోగం శ్రేయస్కరం : డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న లక్ష్మణరావు

గ్రామీణ ప్రాంతాల్లో వినియోగించే వ్యవసాయ పరికరాలు, నిర్మాణ వస్తువులు, ఇతర అనేక రకాల పరికరాల నాణ్యతపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో జిల్లాలోని పంచాయతీ సర్పంచ్‌లు, ఇఒఆర్‌డిలు, సెక్రెటరీలకు రెండ్రోజుల శిక్షణ మంగళవారం జెడ్పీలో ప్రారంభం అయ్యింది. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సిఇఒ మోహన్‌రావు, డివిజనల్ పంచాయతీ అధికారి లక్ష్మణరావు, జెడ్పీ ఏఒ శ్రీనివాసరావు ఈ శిక్షణను ప్రారంభించారు. డిఎల్‌పిఒ లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామాలలో భవన, ఇతర నిర్మాణాల్లో ఉపయోగించే సిమెంట్, ఇనుము, ఇతర వస్తువులు, అలాగే వ్యవసాయ రంగంలో వినియోగించే పనులు నాణ్యమైనవి వాడటం మంచిదన్నారు. నాశిరకం వాడటం వల్ల నష్టం వస్తుందని, నాణ్యమైనవి వాడటం వల్ల ఎక్కువ కాలం మన్ని డబ్బులు వృధాను అరికట్టవచ్చన్నారు. కావున నాణ్యమైన వస్తువుల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు.

మున్సిపాల్టీల్లో ఇంధన పొదుపు అవసరం

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

మున్సిపాలిటీలలో ఇంధన పొదుపు అవసరం తప్పనిసరి అని నగరపాలక సంస్థ ఈఈ జె.శ్రీనివాస్ అన్నారు. ఏపి స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపిఎస్ ఈసిఎం) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అరండల్‌పేటలోని గీతా రీజన్సీలో జిఎంసి ఇంజినీర్లకు, ఎమినిటి కార్యదర్శులకు ఇంధన పొదుపుపై శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో విద్యుత్ బిల్లులను తగ్గించడానికి ఇంధన ఆదా, శక్తిని ఆదా చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీధి దీపాలు 5-10 శాతం, పంపింగ్-20-25శాతం, మురుగు పంపింగ్- 15-20శాతం, మున్సిపల్ భవనాలు 5-10శాతం శక్తి పొదుపునకు అవకాశం ఉందన్నారు. ఏపిఎస్‌ఈసిఎం డిఈఈ జి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఏపిఎస్‌ఈసిఎం కార్యకలాపాల గురించి, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ మద్దతుతో వారు వివిధ కార్యకలాపాలను ఎలా అమలు చేస్తున్నారో వివరించారు. హైదరాబాద్‌లోని సిరి ఎక్సెర్జీ అండ్ కార్బన్ అడ్వైజరీ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ జి సుబ్రహ్మణ్యం ప్రసంగించారు. కార్యక్రమంలో ఈఈలు కొండా రెడ్డి, కోటేశ్వరరావు, ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఎన్ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల పాత్ర కీలకం : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించడంలో ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీలు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం కలక్టరేట్‌లో ఎన్నికల ముందస్తు ఏర్పాట్లలో భాగంగా నియమించబడిన రైల్వే , పోలీస్, ఇన్కమ్ టాక్స్ , జీఎస్టీ , సెబ్, ఆడిట్, ట్రెజరీ, ఫారెస్ట్, బ్యాంకు, పోస్టల్ , ట్రాన్స్పోర్ట్ ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిలో పేర్కొన్న సుచనల మేరకు ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీ అధికారులు విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్ది రూ.95 లక్షలు, శాసన సభకు పోటీ చేసే అభ్యర్ది రూ.40 లక్షల వరకూ ఖర్చు చేయవలసి ఉన్నందున సంబంధిత ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఖర్చుల వివరాలను జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంటుందన్నారు. అలాగే పది లక్షల రూపాయలకు మించి బ్యాంకులలో జరిపిన లావాదేవీలతోపాటు, అనుమానిత లావాదేవీల వివరాలను కుడా బ్యాంకు అధికారులు అందించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సందర్బంగా సీజ్‌చేసిన నగదు, బంగారం, ఇతర ఆభరణాలు వంటి వాటిని కస్టడీలో వుంచడానికి సంబంధిత ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీలు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, ఓటర్లను ప్రభావితం చేయడానికి పంపిణీ చేసే డబ్బు , మద్యం , మత్తుపదార్ధాలు వంటి వాటిని అరికట్టేందుకు అన్ని విభాగాలు ప్రభావవంతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, నగర కమిషనర్ కీర్తి చేకూరి, డిఆర్ఓ పెద్ది రోజా తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపరలో మినీ మార్కెట్ యార్డు ఏర్పాటు

ప్రైవేటు భూమి కొనుగోలుకు యజమానులతో కలెక్టర్ చర్చలు

భూ యజమానులతో సమావేశమైన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు :కొల్లిపర రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకోవటానికి, మార్కెటింగ్ చేసుకోవటానికి మినీ మార్కెట్ యార్డు ఏర్పాటుకు సంబంధించి 4 ఎకరాల 21 సెంట్లు ప్రైవేటు భూమి కొనుగోలుకు భూ యజమానులతో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. గేతేడాది ఫిబ్రవరి 28 వ తేదిన తెనాలి మార్కెట్ట్ యార్డులో వైయస్సార్ రైతు భరోసా కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రికి కొల్లిపర రైతులు తమకు మినీ మార్కెట్ కావాలని వినతిపత్రం అందజేశారు. అక్కడే వున్న జిల్లా కలెక్టర్‌కు మార్కెట్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు. తెనాలి సబ్ కలెక్టర్ అధ్యక్షతన భూమి కొనుగోలుకు కమిటీని జిల్లా కలెక్టర్ నియ మించారు. కొల్లిపర సమీపంలో మార్కెట్ యార్డు నిర్మాణానికి అవసరమైన భూమికి సంబంధించి భూ యజమానులతో చర్చలు జరపడం జరిగింది. ఇందుకు సంబంధించి సబ్‌రిజిస్ట్రార్ భూమి మార్కెట్ విలువను ప్రతిపాదించారు. ఈ క్రమంలో సదరు ప్రైవేటు భూమి యజమానులతో జరిగిన సమావేశంలో యజమానులు తమ భూములను సబ్‌రిజిస్ట్రార్ ప్రతిపాదించిన మార్కెట్ రేటుకు అమ్మకానికి అంగీకరిం చారని కలెక్టర్ తెలిపారు. అనంతరం భూ యజమానులకు పైకం చెల్లించిన వెంటనే మార్కెట్ యార్డు నిర్మాణానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సూచించడం జరిగింది. సమావేశంలో సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్‌జైన్, మార్కెటింగ్ ఏడి రాజబాబు , కలక్టరేట్ ఏ.ఓ జానకి, భూ యజమానులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకొని లక్ష్యాన్ని చేరుకోవాలి

టుబాకో బోర్డు చైర్మన్ అద్దంకి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి-గుంటూరు

అద్దంకి శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న కరస్పాండెంట్ తదితరులు

స్థానిక టిజెపియస్ కళాశాలలో యంబిఎ, ఎంసిఎ విభాగం ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ పరిధిలో అంతర కళాశాలల క్విజ్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ కాంటెస్ట్, షేర్‌మార్కెట్ ట్రెండింగ్ గేమ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు హాజరై మాట్లాడుతూ నేటి కాలంలో అవకాశాలను అందిపుచ్చుకొని, మీ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సాధారణ స్థితి నుండి అసాధారణ స్థితికి చేర్చే ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని, అందరికంటే భిన్నంగా ఆలోచిస్తే అప్పుడే మనం విజయానికి మార్గం వేసినట్టని చెప్పారు. అందరికీ సమయం ఒకటేనని, దానిని ఎలా వినియోగించుకోవాలో తెలిస్తే వాళ్ల జీవితంలో గెలిచినట్లేనని చెప్పారు. యువత ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల మాయలో పడి జీవితాలను విషపూరితం చేసుకోకుండా సాంకేతికతను మన అభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ కాంటెస్ట్ పోటీలలో హిందూ కళాశాల మొదటి స్థానం, టి.జె.పి.యస్ ద్వితీయ, తృతీయ స్థానాలు, బిజినెస్ క్విజ్‌లో టి.జె.పి.యస్ ప్రథమ స్థానం, హిందూ కళాశాల ద్వితీయ, తతీయ స్థానాలు, షేర్ మార్కెట్ ట్రెండింగ్ గేమ్ పోటీలలో ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి ప్రథమ, ద్వితీయ స్థానాలు, హిందూ కాలేజీ తతీయ స్థానం కైవసం చేసుకున్నాయి.కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.వి.బ్రహ్మం, ప్రిన్సిపాల్ ఏబిపి మనోహర్, పిజి కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.అనితాదేవి, కన్వీనర్ డాక్టర్.యు.రవి కుమార్, డాక్టర్. కె.వి.హెచ్. శాస్త్రి, డాక్టర్ చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

జిఎంసి మార్కెట్లు, మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్‌ల నిర్వహణకు వేలం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థకు చెందిన మార్కెట్లు, మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్‌లు 2024 ఏప్రిల్ 1 నుండి 2025 మార్చి 31 వరకూ నిర్వహించటానికి నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు మంగళవారం జిఎంసి ట్రావెలర్స్ బంగ్లాలో సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నగర డిప్యూటీ కమిషనర్ టి.వెంకటక్రిష్ణయ్య రెవెన్యూ అధికారులతో కలిసి నిర్వహించారు. నగరంలో 19 ప్రాంతాల్లో మరుగుదొడ్లు, సైకిల్ స్టాండ్‌లు, మార్కెట్లకు సీల్డ్ టెండర్, బహిరంగ వేలం చేపట్టగా 13 ప్రాంతాలకు టెండర్ దాఖలు అయ్యాయని, మరో 6 ప్రాంతాల్లో టెండర్ దాఖలు చేయాలేదని డిప్యూటీ కమిషనర్ తెలియజేశారు. టెండర్లలో ఆర్టీసి బస్టాండ్ వద్ద కొల్లిశారదా మార్కెట్‌లో ఆశీలు రుసుం వసూళ్లకు అత్యధికంగా రూ.65,00,999లు, గాంధీపార్క్ మరుగుదొడ్ల వద్ద రుసం వసూళ్లకు రూ.32.85 లక్షలు దాఖలు అయ్యాయని వెల్లడించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సాంబశివరావు, బాలాజీబాష, రెహ్మాన్, రెవెన్యూ సెక్షన్ సూపరిండెంట్ వెంకటరామయ్య, ఆర్.ఐ.లు తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు